నీటి ఎద్దడి నివారణకు చర్యలు

● ఎంపీడీవో ప్రభుదయ

జైనూర్, ఏప్రిల్ 5: మండలంలోని పట్నాపూర్, గూడమామడ, మాన్కుగూడ తదితరగ్రామాల్లో శుక్రవారం ఎంపీడీవో ప్రభుదయ పర్యటించారు. ఆయా గ్రామాల్లో ప్రస్తుతం నీటికొరత లేదని ఆయన పేర్కొన్నారు. అదేవిధంగా నీటిఎద్దడి ఉన్న గ్రామాలను త్వరితగతిన సర్వే చేసి ప్రజలకు తాగునీటి సదుపాయం కల్పిస్తామన్నారు. ఈ సందర్భంగా ఎంపీపీ కుంర తిరుమల తదితరులు ఉన్నారు.

బాధితులను ప్రభుత్వం తరపున ఆదుకుంటాం



పెంచికలపేటలో బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న కాంగ్రెస్ నాయకులు

కౌటాల, ఏప్రిల్ 5: ఏనుగుదాడిలో మృతిచెందిన ఇద్దరి కుటుంబాలను ప్రభుత్వం తరపున ఆదుకునేందుకు కృషి చేస్తామని కాంగ్రెస్‌పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి రావి శ్రీనివాస్ అన్నారు. మండలకేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాజీ జడ్పీచైర్మన్ సిడాం గణపతితో కలిసి ఆయన మాట్లాడారు. ఏనుగు దాడిలో మృతి చెందిన ఇద్దరి కుటుంబాలకు రూ.10లక్షల చొప్పున ఆర్థిక సహయం అందేలా కృషి చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు శైలజ ప్రభాకర్‌గౌడ్, సత్యనారాయణ, మధుకర్, శ్రీనివాస్, అశోక్‌గౌడ్, దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ..

పెంచికలపేట: ఏనుగు దాడిలో మరణించిన కారు పోచయ్య కుటుంబాన్ని శుక్రవారం కాంగ్రెస్ నాయకుడు రావి శ్రీనివాస్ పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడి మంత్రిదృష్టికి తీసుకువెళ్లి బాధితకుటుంబానికి ప్రభుత్వం తరపున రూ.10లక్షల ఎక్స్‌గ్రేషియా, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం వచ్చేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు అనీల్‌గౌడ్, తిరుపతి, సంజీవ్, లచ్చన్న, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.



ఎండలో పని చేస్తున్న కూలీలు

వేతనం పెంచారు.. వసతులు మరిచారు

● దినసరి కూలి రూ.300 పెంపు ● పనిప్రదేశంలో వసతులు లేక కూలీల ఇక్కట్లు

వాంకిడి, ఏప్రిల్ 5: ఉపాధి హామీ పథకంలో పనులు చేస్తున్న వారికి ప్రభుత్వం దినసరి కూలి పెంచింది. ఏప్రిల్ 1 నుంచి చెల్లించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. గత ఏడాది ఏప్రిల్1 నుంచి ఈ ఏడాది మార్చి 31 వరకు రూ.272 చెల్లిస్తుండగా ఇప్పుడు మరో రూ.28 పెంచింది. దీంతో దినసరి కూలి రూ.300లకు చేరుకుంది. జిల్లా వ్యాప్తంగా 15మండలాల్లో 93 వేల జాబ్‌కార్డులు ఉండగా 1.73 లక్షల మంది కూలీలు పని చేస్తున్నారు. 2005లో ఉపాధి హామీ పథకం ప్రారంభమైంది. అప్పుడు కేవలం రూ. 87.50 మాత్రమే చెల్లించేవారు. క్రమంగా పెంచుతూ ఉండడంతో ప్రస్తుతం రూ.300లకు చేరింది. ప్రభుత్వం ఉపాధి కూలీలకు రోజు కూలి రూ.300 పెంచినప్పటికీ పని ప్రదేశాల్లో మాత్రం ఎలాంటి సదుపాయాలు కల్పించడం లేదన్న ఆరోపణలు వస్తున్నాయి.

నిబంధనలు బేఖాతరు

జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో అధికారులు నిబంధన లను బేఖాతరు చేస్తున్నారు. నిబంధనల ప్రకారం పనిప్రదేశాల్లో కనీస వసతులు కల్పించాలి. కూలీలకు నీడ కోసం టెంట్లు ఏర్పాటు చేయడంతోపాటు మెడికల్‌కిట్లు, తాగునీరు మజ్జిగ, ఓఆర్ఎస్ పాకెట్లను అందుబాటులో ఉంచాలి. కానీ ఐదేళ్ల లో జిల్లాలో ఎక్కడా ఈ సౌకర్యాలు కల్పిం చడంలేదు.

దీంతో ప్రతి సంవత్సరం 44,45 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతల్లోనూ కూలీలు ఉపాధి పనులు చేస్తూ అవస్థలు పడాల్సి వస్తోంది. నీడ లేకపోవడంతో కూలీలు చెట్ల కిందనే సేద తీరుతున్నారు. గతంలో వేసవిలో కొందరు కూలీలు వడదెబ్బతో తీవ్ర అస్వస్థతకు గురైన, మృతిచెందిన సంఘటనలు ఉన్నాయి. ఉదయం 8గంటలలోపే పనులకు వెళ్లే ఉపాధి కూలీలు మధ్యాహ్నం 12గంటలవరకు పనులు ముగించుకుని ఇంటికి వస్తుంటారు.

వీరికి కనీసం తాగునీరు కూడా ఏర్పాటు చేయక పోవడంతో తమతోపాటు క్యాన్లల్లో నీరు తీసుకువెళ్తుంటారు. పనులకు ఉపయోగించే పలుగు, పారలకు రోజువారీ అలవెన్సులు, మంచినీటికి రూ.5 చొప్పున చెల్లిస్తున్నామని చెబుతున్నా అవి కూడా సకాలంలో అందిన సందర్భాలు లేవు. ఈ ఏడాది రికార్డు స్థాయిలో ఎండలు మండిపోతాయని ఇప్పటికే వాతావరణశాఖ హెచ్చరించిన నేపథ్యంలో అధికారులు ఈ సారైనా పనిప్రదేశాల్లో తగిన ఏర్పాట్లు చేయాలని ఉపాధిహామీ కూలీలు కోరుతున్నారు.

నిరాశలో కూలీలు

2022లో ఉపాధి హామీ పనులు చేసే కూలీలకు కేంద్రం రూ.12 పెంచింది. 2023 లో రూ.15అదనంగా చెల్లించారు. ఇప్పుడు రూ.28 పెంచగా రూ. 300లకు చేరింది. అయినా కూలీలు నిరాశతో ఉన్నారు. గతంలో ఫిబ్రవరి నుంచి జూన్ వరకు దినసరి కూలితో పాటు వేసవి భత్యం చెల్లించేవారు. ఆ సమయంలో 15నుంచి 30శాతం వరకు అధికంగా ఉండేది. రెండేళ్ల నుంచి దీనిని తొలగించారు. పలుగు, పార భత్యాలు కూడా వారానికి ఒకసారి చెల్లించేవారు. దానిని కూడా ఆపేశారు.

సద్వినియోగం చేసుకోవాలి

శ్రావణ్- ఏపీఎం, వాంకిడి



ఉపాధి హామీ కూలీలకు ప్రభుత్వం రూ.28 పెంచింది. దీంతో దినసరి కూలీ రూ.300 లకు చేరుకుంది. కూలీలు పెరిగిన వేతనాన్ని సద్వినియోగం చేసుకోవాలి. ఉపాధి కూలీల హాజరు పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నాం. పనిప్రదేశాల్లో కూలీలకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకుంటాం.

భానుడి ఉగ్రరూపం

● దంచికొడుతున్న ఎండలు
● జిల్లాలో 43.3డిగ్రీలకు చేరుకున్న ఉష్ణోగ్రతలు
● జనం ఉక్కిరిబిక్కిరి

ఆసిఫాబాద్, ఏప్రిల్ 5: భానుడు రోజురోజుకు ఉగ్రరూపం దాల్చుతున్నాడు. జిల్లాలో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో జనం ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. శుక్రవారం జిల్లాలో 43.3 డిగ్రీల అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఉదయం 8గంటల నుంచే మొదలవు తున్న వడగాల్పులు రాత్రి 8గంటల వరకు కొనసాగుతుండటం ఆందోళన కలిగిస్తోంది. ఎండవేడిమి ఉక్కపోతతో జనం అల్లాడిపోతున్నారు. భానుడి భగభగలకు మధ్యా హ్నం రోడ్లన్నీ వెలవెలబోతున్నాయి. ఏప్రిల్ ఆరంభంలోనే 43డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు అవుతుండగా ఇక మే నెలలో ఎండలు మరింత పెరిగే అవకాశాలు ఉన్నాయని వాతావరణశాఖ హెచ్చరిస్తోంది. ఎండల తీవ్రత ఉక్కపోత వడగాలులవల్ల వడదెబ్బకు గురయ్యే అవకాశం ఉన్నందున ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యఆరోగ్యశాఖ అధికారులు సూచిస్తున్నారు.

జిల్లాలో 43.3 డిగ్రీల ఉష్ణోగ్రతల నమోదు..

కుమరంభీం ఆసిఫాబాద్ జిల్లాలో శుక్రవారం 43.3 డిగ్రీల అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రాష్ట్ర వ్యాప్తంగా నమోదైన ఉష్ణోగ్రతలో జిల్లా మూడవ స్థానంలో ఉంది. ఆసిఫాబాద్ మండలంలో 43.3 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు కాగా, రెబ్బెన మండలంలో 43.0డిగ్రీలు, వాంకిడి మండలంలో 42.6 డిగ్రీలు, తిర్యాణి, కెరమెరిలలో 41.9 డిగ్రీలు, సిర్పూర్(టి), దహెగాంలలో 41.2డిగ్రీలు, పెంచికల్‌పేట మండలంలో 41.1డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

గువ్వలగూడలో వైద్య శిబిరం

కాగజ్‌నగర్, ఏప్రిల్ 5: కాగజ్‌నగర్ మండలం గువ్వలగూడలో ఎస్పీఎం స్పర్శ ఆధ్వర్యంలో శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా మిల్లు చీఫ్ మేనేజర్ రమేష్ మాట్లాడుతూ మిల్లు ఆధ్వర్యంలో వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నామని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ప్రాణహితను దాటిన గజరాజు

● ముగిసిన ఆపరేషన్
● ఊపిరి పీల్చుకున్న అధికారులు

పెంచికలపేట, ఏప్రిల్ 5: మండలంలో గజరాజు ఫీం కారం అటవీఅధికారులను.. ఇటుప్రజలను హడలెత్తిస్తోంది. గురువారం రాత్రి 9గంటల ప్రాంతంలో ఆర్టీసీ బస్సుకు ఎదురైన ఏనుగు శుక్రవారం ఉదయం 7గంటల ప్రాంతంలో కమ్మర్‌గాం గ్రామశివారులోని పల్లెప్రకృతి వనం ఆవరణలో సంచరిస్తుండగా గ్రామ యువకులు గమనించి తమ సెల్‌ఫోన్‌లో ఫోటోలు తీశారు. కొంతసమయం ప్రకృతివనం ఆవరణలో ఉన్న ఏనుగు అనంతరం సమీప అడవిలోకి వెళ్లినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. మధ్యాహ్నం ఒంటిగంట ప్రాంతంలో మురళీ గూడ ప్రధానరహదారిపై ఆటోకు ఎదురుగా రావడంతో ప్రయాణికులు ఆటోదిగి వెనక్కి వెళ్లిపోయారు. ఆ సమయంలో అటుగావస్తున్న అధికారులకు కూడా తారసపడినట్లు అధికారులు తెలిపారు.

ఆపరేషన్ విజయవంతం..

ఆసిఫాబాద్/పెంచికల్‌పేట: జిల్లాలో ఆపరేషన్ గజ విజయవంతం అయింది. శుక్రవారం రాత్రి ఏనుగు ప్రాణహిత సరిహద్దుల మీదుగా మహరాష్ట్రలోని గడ్చిరోలి జిల్లా చిన్నవట్ర అటవీప్రాంతంవైపు వెళ్లింది. దీంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్రల నుంచి జిల్లాకు దారితప్పిన వచ్చిన ఏనుగు బీభత్సం సృష్టించి 24గంటల వ్యవధిలోనే ఇద్దరు ప్రాణాలను బలిగొంది. దీంతో అటవీశాఖ అధికారులు సవాలుగా తీసుకున్నారు. రాష్ట్ర, జిల్లాస్థాయి అధికారులు ఇక్కడే మకాం వేసి ఏనుగు కదలికలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ సిబ్బందికి సూచనలు చేశారు. ఇద్దరిని బలిగొనడంతో ప్రజల్లో భయం మొదలవుతున్న నేపథ్యంలో అటవీ, పోలీసుశాఖ ప్రత్యేకకార్యచరణ మొదలుపెట్టింది. శుక్రవారం ఉదయం 7గంటలకు పెంచికల్‌పేట మండలం కమ్మర్‌గాంలో ఏనుగు కొంతమందికి తారసపడగా వారుఇచ్చిన సమాచారంమేరకుఅటవీశాఖ అధికారులు 100మంది సిబ్బందితో నాలుగుడ్రోన్‌లు, రెండు థర్మల్ డ్రోన్‌ల సాయంతో ఏనుగు కదలికలను ట్రాక్‌చేశారు. మధ్యాహ్నం మురళీగూడ అటవీ ప్రాంతం మీదుగా ప్రాణహిత తీరానికి చేరుకున్నట్లు అధికారులు గుర్తించారు. ఏనుగునుసురక్షితంగా గడ్చిరోలిఅటవీ ప్రాంతం వైపు వెళ్లేలా అధికారులు ప్రయత్నాలు చేశారు. దీంతో రాత్రి 7:30నుంచి 8:00గంటల ప్రాంతంలో ప్రాణహిత నదిని ఈదుతూ మహారాష్ట్రలోని గడ్చిరోలి అటవి ప్రాంతంవైపు వెళ్లిందని అటవీశాఖ అధికారులు ధ్రువీకరించారు. దీంతో అటు అధికారులు, ఇటు ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.



మురళీగూడలో రోడ్డుపై వెళ్తున్న ఏనుగు



డ్రోన్‌కెమెరాతో పర్యవేక్షిస్తున్న అధికారులు

పోలీసు స్టేషన్‌ను తనిఖీ చేసిన ఎస్పీ



ఎస్సైని వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఎస్పీ సురేష్‌కుమార్

కెరమెరి, ఏప్రిల్ 5: కెరమెరి పోలీసుస్టేషన్‌ను శుక్రవారం ఎస్పీ సురేష్ కుమార్ ఆకస్మికంగా తనిఖీచేశారు. ఈ సందర్భంగా పోలీసు సిబ్బంది విధులు, కేసులకు సంబంధించిన ఫైల్‌లు, రికార్డులను పరిశీలించారు. పోలీసు స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా ఉంటూ సమస్యలను ఓపికతో పరిష్కరించాలన్నారు. ఆయనవెంట డీఎస్పీ సదయ్య, సీఐశ్రీనివాస్, ఎస్సై విజయ్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జిగా కోట్నాక విజయ్



కోట్నాక విజయ్

ఆసిఫాబాద్, ఏప్రిల్ 5:ఆసిఫాబాద్ నియోజకవర్గ పార్లమెంట్ ఎన్నికల ఇన్‌చార్జిగా బీజేపీ జిల్లాప్రధానకార్యదర్శి కోట్నాక విజయ్‌ని నియమిస్తూ ఆదిలాబాద్ ఎమ్మెల్యే, పార్లమెంట్ ఉమ్మడిజిల్లా ఇన్‌చార్జి పాయల శంకర్ శుక్రవారం పేర్కొన్నారు. ఈ సందర్భంగా విజయ్ మాట్లాడుతూ తనపై ఎంతో నమ్మకం ఉంచుకొని ఆదిలాబాద్ పార్లమెంట్ పరిధిలోని ఆసిఫాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జిగా నియమించినందుకు కృతజ్ఞతలు తెలియ జేశారు. ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి గెలుపునకు తనవంతు కృషి చేస్తానన్నారు.

విద్యార్థినులకు సైకిళ్ల పంపిణీ

దహెగాం, ఏప్రిల్ 5: మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో చదువుతున్న ఇద్దరి విద్యార్థినులకు చంద్రకాని లింగారావు తన కుమార్తె రితిక్ష జన్మదినం సందర్భంగా సైకిళ్లను అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

సత్ప్రవర్తనతో ఉంటే రౌడీషీట్ ఎత్తివేస్తాం: డీఎస్పీ



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న డీఎస్పీ సదయ్య

ఆసిఫాబాద్, ఏప్రిల్ 5: ఎలాంటి నేరాలకు పాల్పడ కుండా సత్ప్రవర్తనతో ఉంటే రౌడీషీట్ ఎత్తివేస్తామని డీఎస్పీ సదయ్య అన్నారు. శుక్రవారం సబ్‌డివిజన్ పరిధిలోని రౌడీషీటర్లకు పట్టణ పోలీసుస్టేషన్‌లో కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవన్నారు. రౌడీషీట్ ఉన్న వ్యక్తులపై ప్రత్యేక నిఘా ఉంటుందన్నారు. మార్పు రాకపోతే కఠినంగా వ్యవహరిస్తామన్నారు. గతంలో నేరాలకు పాల్పడిన వారు నేర ప్రవృ త్తిని వీడి సమాజంలో మంచి నడవడికతో కొనసాగాలన్నారు. నేరాలు చేసిన వారి కుటుంబసభ్యులు సమాజంలో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కోవల్సి వస్తుందన్నారు.

రౌడీషీటర్లు తమ కుటుంబాలు, పిల్లల భవిష్యత్ గురించి ఆలోచించాలన్నారు. నేరాల నియంత్రణలో భాగస్వాములు కావాలన్నారు. ఒకవేళ మారకపోతే కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐలు సతీష్, శ్రీనివాస్, ఎస్సై చంద్రశేఖర్, ప్రవీణ్ పాల్గొన్నారు.

బడుగు బలహీనవర్గాల ఆశాజ్యోతి జగ్జీవన్‌రామ్



కలెక్టరేట్‌లో నివాళులు అర్పిస్తున్న కలెక్టర్, ఎస్పీ తదితరులు

ఆసిఫాబాద్, ఏప్రిల్ 5: బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ అని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో బాబు జగ్జీవన్‌రామ్ 117వ జయంతి సందర్భంగా ఏర్పాటు చేసిన వేడుకలకు ఎస్పీ సురేష్ కుమార్, అదనపు కలెక్టర్ దాసరి వేణు, షెడ్యూల్డ్ కులాల సంక్షేమ శాఖాధికారి సజీవన్, ఆర్డీవో లోకేశ్వర్‌రావు, వివిధసంఘాల నాయకులు హాజరై జగ్జీవన్ రామ్ చిత్రటానికి పూలమాలలు వేసి జ్యోతి ప్రజ్వలన చేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుడిగా, భారత దేశ తొలి ఉప ప్రధానమంత్రిగా బడుగు బలహీనవర్గాల సంక్షేమం కోసం అనేక సంస్కరణల ద్వారా విశేష కృషి చేశారని అన్నారు. ఆయన ఆశయాలను నేరవేర్చే విధంగా ప్రతి ఒక్కరూ కృషిచేయాలని అన్నారు. కార్యక్రమంలో జిల్లాసంక్షేమ శాఖాధికారి భాస్కర్, గిరిజన సంక్షేమాధికారి రమాదేవి, జిల్లా వైద్యాధికారి తుకారాం, డీఎస్పీ సదయ్య, కలెక్టరేట్ ఉద్యోగులు, కులసంఘాల నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా జగ్జీవన్‌రామ్ జయంతి

ఆసిఫాబాద్ రూరల్, ఏప్రిల్ 5: పట్టణంలోని విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా కార్యాలయంలో శుక్రవారం ఆ యూనియన్ జిల్లాఅధ్యక్ష, ఉపాధ్యక్షుడు కరుణాగౌడ్, షిరాజ్ ఉల్‌హక్ ఆధ్వర్యంలో, జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకులు బాబుజగ్జీవన్‌రామ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సంఘం నాయకుల వెంకటేశ్వర్లు, పద్మ, లింగయ్య, కిష్టయ్య, సుభాష్‌సింగ్, గౌరక్క, వరలక్ష్మి, ప్రభాకర్, రాజేశ్వర్, పోశన్న, నర్సయ్య, వెంకటేశ్వర్లు, ఎమ్మార్పీఎస్ నాయకులు రేగుంట కేశవరావు, అశోక్, బాపు, రూప్‌నార్ రమేష్, మారుతి, పుల్లయ్య, మహేష్, సాగర్, రాంచందర్, మహేష్, నాగరాజు, అశోక్, సంతోష్, సురేష్, మహేష్, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

వాంకిడి: మాజీ ఉపప్రధాని, బడుగు బలహీనవర్గాల ఆశాజ్యోతి బాబు జగ్జీవన్‌రామ్ జయంతిని బుధవారం మండలంలోని వివిధ గ్రామాల్లో ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. బాబు జక్జీవన్ రామ్ ఆశయసాధనకు ప్రతిఒక్కరూ కృషిచేయాలని ఈసందర్భంగా పలువురు కోరారు. కార్యక్రమంలో నాయబ్ తహసీల్దార్ దుర్గం శ్రావణ్, డీవైఎఫ్ఐ జిల్లాకార్యదర్శి గొడిసెల కార్తీక్, వాంకిడి ఎమ్మార్పీఎస్ నాయకులు వడ్లూరి రాజేష్, రొడ్డ శంకర్, విలాస్, దొబ్బల కార్తీక్, ఖిరిడి గ్రామ ఎమ్మార్పీఎస్ నాయకులు గోగర్ల తిరుపతి, లింగమూర్తి, సునీత, వైశాలీ, శ్రీజ, పద్మ, తహసీల్ కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

కెరమెరి: ఎంపీడీవో, తహసీల్దార్ కార్యాలయాల్లో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఎంపీడీవో కృష్ణారావు, ఎంపీవో అంజద్‌పాషా, కార్యదర్శి భీమయ్య, తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కాగజ్‌నగర్ టౌన్: కాగజ్‌నగర్ పట్టణంలో శుక్రవారం బాబు జగ్జీవన్‌రామ్ జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు మాట్లాడుతూ బాబు జగ్జీవన్ రామ్ ఆశయాలను సాధించేందుకు అంతా కృషి చేయాలన్నారు. జడ్పీ ఇన్‌చార్జి చైర్మన్ కోనేరు క్రిష్ణారావు మాట్లాడుతూ మహనీయుడి బాటలో అంతా నడవాలన్నారు. అలాగే విశ్రాంత ఉద్యోగుల సంఘం, సీపీఎం పార్టీ, సీనియర్ సిటిజన్ సంఘం ఆధ్వర్యంలో జయంతిని నిర్వహించారు. కార్యక్రమంలో జయదేవ్ అబ్రహం, ముంజం ఆనంద్, శివప్రసాద్, సుభాష్, పురుషోత్తం, ఏటుకూరి శ్రీనివాస్, సాంబశివరావు, ఈర్ల విశ్వేశ్వర్‌రావు, మేడి చరణ్ దాస్, లెండుగురె శ్యాంరావు, మోబీన్, మార్త సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రెబ్బెన: మండల కేంద్రంలో బాబు జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జడ్పీటీసి వేమురల్ల సంతోష్, శ్రీధర్, రాజేశ్, నర్సింహులు, అశోక్, శంకర్, ధర్మయ్య పాల్గొన్నారు.

చింతలమానేపల్లి: తహసీల్దార్ కార్యాలయంలో బాబు జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో తహసీల్దార్ నాగరాజుగౌడ్, డీటీ బీమ్లానాయక్, పోలీసు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

బెజ్జూరు: మండలకేంద్రంతోపాటు సలుగుపల్లి గ్రామంలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఆయన చేసినసేవలను కొనియాడారు. కార్యక్రమంలో సంతోష్, శంకర్, వరుణ్, పద్మకర్, విశ్వనాథ్, పురుషోత్తం, సన్యాసి, తిరుపతి, ఎమ్మార్పీఎస్ నాయకులు శ్రీశైలం, తదితరులు పాల్గొన్నారు.

దహెగాం: తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాల్లో బాబు జగీజవన్‌రామ్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ కళావతి, వజియ్, రికార్డు అసిస్టెంట్ రాజన్న, షారూక్, ఖాజామియా, టైపిస్టు బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

సిర్పూర్(టి): ఎంపీడీవో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి ఎంపీడీవో సత్యనారాయణ పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో నాయకులు అఖిల్, కార్యదర్శి సిబ్బంది పాల్గొన్నారు.

కౌటాల: బాబు జగ్జీవన్‌రామ్ ఆశయ సాధనకు కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే కోనేరుకోనప్ప అన్నారు. మండలకేంద్రంలోని సదాశివపేట క్రాస్‌రోడ్డు వద్ద జగ్జీవన్ రావు విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగ్జీవన్‌రామ్ దేశ ఉపప్రధానిగా ఎంతో సేవచేశారని ఆయనను స్మరించుకోవడం ప్రతిఒక్కరి బాధ్యత అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు రావి శ్రీనివాస్, మాజీ జడ్పీ చైర్మన్ సిడాం గణపతి తదితరులు పాల్గొన్నారు.



వాంకిడి మండలం ఖిరిడిలో నివాళులు అర్పిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు



ఆసిఫాబాద్‌లో నివాళులు అర్పిస్తున్న ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకులు



కాగజ్‌నగర్‌లో జయంతి వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు



కౌటాలలో నివాళులు అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ నాయకులు

దేశ ప్రజల సంక్షేమాన్ని వివరిస్తాం

మందమర్రిటౌన్, ఏప్రిల్ 5 : హైద్రాబాద్‌లోని తుక్కుగూడలో ఈ నెల6న జరిగేసభలోదేశప్రజల సంక్షేమాన్నివివరిస్తామని రాష్ట్రకనీసవేతనాల మండలిచైర్మన్, ఆలిండియామేనిఫెస్టో కమిటీసభ్యుడు జనక్‌ప్రసాద్ తెలిపారు. రెండురోజులుగా హైద్రాబాద్‌లో మంత్రిశ్రీధర్‌బాబుతో కలిసి చర్చిస్తున్నామన్నారు. సభకు రాహుల్‌గాంధీ హాజరై అనేక అంశాలను వివరించనున్నారని తెలిపారు.కేంద్రం ప్రతిపక్ష పార్టీలను ఏ విధంగా అణిచివేస్తుందో వివరిస్తారని తెలిపారు.

ఆర్థిక సహాయం

మందమర్రిటౌన్, ఏప్రిల్ 5: పట్టణంలోని రెండోజోన్‌కు చెందిన చిన్నారులు హార్తిక్, కార్తీక్‌లకు మాపద్మావతి వెల్ఫేర్‌ఫౌండేషన్ సభ్యులు శుక్రవారం రూ.12వేలు, సరుకులు అందించారు. అధ్యక్షుడు వడ్లకొండ కనకయ్యగౌడ్, కాంగ్రెస్ నాయకుడు గుడ్ల రమేష్‌లు మాట్లాడుతూ తల్లీతండ్రి మృతిచెందడంతో అమ్మమ్మ వద్ద ఉంటున్న చిన్నారులకు ప్రతీ ఒక్కరు చేయూతనందించాలన్నారు. తిరుమల్‌రెడ్డి, మహంత్ అర్జున్‌కుమార్, సతీష్‌బాబు, శంకర్, శ్రీనివాస్, సాయి, రంజిత్ తదితరులు పాల్గొన్నారు. ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన జూపాక సంపత్‌కుటుంబానికి మిత్రులు శుక్రవారం రూ.35 వేల ఆర్థికసహాయం అందజేశారు. జిల్లాపరిషత్ ఒర్రెగడ్డ పాఠశాలలో1986-87 బ్యాచ్‌పదవ తరగతికి చెందినమిత్రులు జమ్మికుంటలోని తనుగులలో జరిగిన సంపత్ దశదినకర్మలో పాల్గొని ఆర్థిక సహాయం అందించారు.

పనికోసం వచ్చి మృత్యు ఒడిలోకి వెళ్లిన కూలీ

● అనాథలైన ఇద్దరు కుమారులు

మెట్‌పల్లి రూరల్, ఏప్రిల్ 5: జగిత్యాలజిల్లా మెట్‌పల్లి మండలంలోని చౌలమద్ది గ్రామంలోని బ్రిడ్జినిర్మాణపనుల కోసంవచ్చి పూజారి శ్రీనివాస్ (30) అనేకార్మికుడు మృతిచెందిన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. గ్రామస్థులు, స్థానికులు తెలిపినవివరాల ప్రకారం.. ఆసిఫాబాద్ జిల్లా రెబ్బెన గ్రామానికిచెందిన పూజారి శ్రీనివాస్ కూలి పనులు చేసు కుంటూ జీవనం జీవనం కొనసాగిస్తున్నాడు. శ్రీనివాస్ భార్య గతంలోనే మృతిచెందింది. తనఇద్దరు పిల్లలతో కలిసిపనిదొరికిన చోటచేసుకొంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. చౌలమద్ది గ్రామంలోని వాగుపై బ్రిడ్జినిర్మాణంలో కూలిపనికోసం తోటికూలీలతో కలిసివచ్చాడు. ఈక్రమంలో శుక్రవారం సాయంత్రం వాగులో తోటికూలీలతో కలిసి స్నానం చేస్తుండగా ప్రమాదవశాత్తు నీటిలో మునిగి పోయాడు. తోటికూలీలు వెతుకుతుండగా పూజారి శ్రీనివాస్ విగతజీవిలా నీటిపై తేలాడు. తల్లిదండ్రిని కోల్పోయిన ఆఇద్దరు పిల్లలు అనాథలు అయ్యారు. శ్రీనివాస్ మృతదేహంపై పడి రోదిస్తున్న పిల్లలను చూసి పలువురు కంటతడి పెట్టారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



గురువులతో పూర్వ విద్యార్థులు

నెన్నెల, ఏప్రిల్ 5 : నెన్నెల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. 2005-06లో పదో తరగతి చదవిన పూర్వ విద్యార్థులు శుక్రవారం నెన్నెలలో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో ఉల్లాసంగా... ఉత్సాహంగా గడిపారు. ఎక్కడెక్కడో స్థిరపడి 19 వసంతాల అనంతరం కుటుంబ సమేతంగా ఒకే వేదిక మీద కలిశారు. అప్పటి టీచర్లు మధురవాణి, ప్రమీళ, గోపాలకృష్ణయ్య, రామ్మూర్తి, నర్సింహరెడ్డి, రవికుమార్, శంకరయ్యలను సన్మానించి, జ్ఞాపికలు అందజేశారు. తాము విద్యాబుద్ధులు నేర్పిన పిల్లలు ప్రయోజకులైనందుకు సంతోషంగా ఉందంటూ గురువులు ఆనందం వ్యక్తంచేశారు.

ఆలయంలో చోరీకి పాల్పడిన ఇద్దరు అరెస్టు



మాట్లాడుతున్న సీఐ నరేందర్

దండేపల్లి, ఏప్రిల్ 5 మండల కేంద్రంలోని మల్లన్న గుడిలో, అంబేద్కర్ చౌరస్తాలో ఆటోను దొంగిలించిన ఇద్దరు వ్యక్తులను శుక్రవారం అరెస్టు చేసినట్లు సీఐ అల్లం నరేందర్, ఎస్సై స్వరూప రాజ్‌లు తెలిపారు. శుక్రవారం గూడెం ఫారెస్టు చెక్‌పోస్ట్ వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా అను మానస్పదంగా ఆటోతో వచ్చిన తూర్పాటి కనకయ్య (రేకుర్తి కొత్తపల్లి, కరీం నగర్), పత్తి కనకరాజు(హనుమాన్ నగర్, కరీంనగర్)లను అదుపులోకి తీసుకుని విచారించగా దొంగతనం చేసినట్లు ఒప్పుకున్నట్లు తెలిపారన్నారు. ఆటో ట్రాలీ, ద్విచక్ర వాహనంతో పాటు మల్లన్న గుడిలో చోరీ చేసిన సొత్తును స్వాదీనం చేసుకున్నట్లు తెలిపారు.

బెయిల్‌పై వచ్చి చోరీకి పాల్పడి

ఏసీసీ, ఏప్రిల్ 5 : దొంగతనం కేసులో జైలు నుంచి ఈనెల 4న బెయిల్‌పై విడుదలైన ఇద్దరు నిందితులు అదేరోజు మరోదొంగతనం చేయడంతో అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పట్టణ ఇన్‌స్పెక్టర్ బన్సీలాల్ తెలిపారు. మార్చి 16న మంచిర్యాల అశోక్‌రోడ్డుకు చెందిన అనుముల శ్రీధర్, హమాలివాడకు చెందిన వెంగళ శ్యాంకుమార్‌లు నాలుగు ఆటోలను దొంగతనం చేసిన కేసులో పట్టుబడ్డారన్నారు. నిందితులను రిమాండ్ చేసిజైలుకు పంపగా బెయిల్‌పై ఈనెల 4న బయటకు వచ్చారన్నారు. చేతిలో డబ్బులు లేకపోవడంతో తిరిగిదొంగతనం చేయాలని నిర్ణయించుకుని శ్రీనివాస థియేటర్ వెనుక ఉన్న అపార్టుమెంట్‌లో ఆటోను దొంగలించారన్నారు. శుక్రవారం ఆటోను అమ్మేందుకు కరీంనగర్‌కు తీసుకువెళ్తుండగా మంచిర్యాల ఓవర్ బ్రిడ్జి సమీపంలో పోలీసులు వాహనాల తనిఖీ చేస్తుండగా పట్టుబడ్డారన్నారు. నిందితుల వద్ద నుంచి ఆటోను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

టిప్పర్‌లను అడ్డుకున్న నిర్వాసిత కుటుంబం

కాసిపేట, ఏప్రిల్ 5: ఓరియంట్‌లో భూములు కోల్పోయిన తమకు న్యాయం చేయాలని శుక్రవారం బాధిత కుటుంబ సభ్యులు మైన్స్ ఏరియాలో టిప్పర్లను అడ్డుకుని నిరసన తెలిపారు. బాధితురాలు కోవ ఇంద్రుబాయి మాట్లాడుతూ దేవాపూర్ శివారులోని సర్వే నెంబరు 84/1, 84/136 సర్వే నెంబర్లలోని 5 ఎకరాల భూమిని 40 ఏండ్ల క్రితం ఓరియంట్ కంపెనీ తీసు కుందని, నష్టపరిహారం చెల్లించకపోగా ఉద్యోగం ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. భూమిలో గుడిసె వేసుకుని నివాసం ఉంటున్నామని, శుక్రవారం మైన్స్‌లో పేల్చిన బత్తి దెబ్బలకు ఇంటిపై బండరాళ్లు పడ్డాయన్నారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ ఆంజనేయులు, కంపెనీ అధికారులు బాధితులకు నచ్చజెప్పేందుకు ప్రయత్నించారు. తమకు న్యాయం జరిగే వరకు ఇక్కడ నుంచి కదలమని తేల్చి చెప్పారు. కేవలం 200 మీటర్ల దూరంలోనే బత్తి దెబ్బలు పేలుతుండడంతో భయపడుతున్నామని, తమకు న్యాయం చేయాలని కోరారు. అనంతరం ఓరియంట్ కంపెనీ అధికారులు బాధితులను చర్చలకు పిలిచారు. ఉద్యోగంతోపాటు నష్టపరిహారం చెల్లించేందుకు ఓరియంట్ యాజమాన్యంతో మాట్లాడుతామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. బాధితులు ఇంద్రుబాయి, కొడప కమల, కోవ రాజు, కోవప్రేమలత, కోవ సూర్యరాజ్ పాల్గొన్నారు.

పెళ్లి వేడుకలో పాల్గొన్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

జైనూర్, ఏప్రిల్ 5: మండలంలోని జంగాం, జామ్ని, దుబ్బగూడ తదితర గ్రామాల్లో శుక్రవారం నిర్వహించిన వివాహ వేడుకల్లో ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆదివాసుల వివాహవేడుక అందరికంటే భిన్నంగా ఉంటుందన్నారు. రాతి వేళలో నిర్వహిస్తున్న ధిమ్సా నృత్యాలతో చూపరులు ఆనందంతో ఉప్పొంగి పోతారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆత్రంసక్కును భారీమెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు ఇంతీయాజ్‌లాల, వైస్ఎంపీపీ చిర్లే లక్ష్మణ్, మాజీ సర్పం చులు మేస్రాం పార్వతీబాయి, మడావి భీంరావ్, మేస్రాం గోవింద్‌రావ్, నాయకులు ఆత్రం శంకర్, మేస్రాం శంకర్, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలంలో వెలిసిన నిర్మాణాన్ని తొలగించిన అధికారులు

కాగజ్‌నగర్, ఏప్రిల్ 5: ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదుట ఉన్న ఖాళీ స్థలంలోని నిర్మాణాన్ని తహసీల్దార్ కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో అధికారులు తొలగించారు. ఈసందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ ప్రభుత్వస్థలాల్లో ఆక్రమణాలు పుట్టగొగుల్లా వెలుస్తున్నా ఎందుకు తొలగించటం లేదని నిల దీశారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్లు అందజేత



సెల్‌ఫోన్‌ను అందజేస్తున్న ఎస్‌హెచ్‌వో శంకరయ్య

కాగజ్‌నగర్, ఏప్రిల్ 5: కాగజ్‌నగర్ పట్టణంలో వారం రోజుల క్రితం వెర్వేరు కాలనీల్లో సెల్‌ఫోన్లు పోగొట్టుకున్న ముగ్గురికి శుక్రవారం ఎస్‌హెచ్‌వో శంకరయ్య సెల్‌ఫోన్లను అందజేశారు. సెల్ ఫోన్ల విషయంలో జాగ్రత్తగా ఉండాలన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి



బలరాం(ఫైల్)

నెన్నెల, ఏప్రిల్ 5: మండల కేంద్రంలోని కంబాల కుంట వద్ద శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో బెల్లంపల్లి మండలం లింగాపూర్ గ్రామానికిచెందిన బానోత్ బలరాం(38) మృతిచెందగా నెన్నెల మండలం లంబాడితండాకు చెందిన నవీన్ తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులకథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. బంధువులైన బలరాం, నవీన్ లంబాడితండాలో వరపూజలో పాల్గొన్నారు. పనిపై నెన్నెలకు వచ్చి తిరిగి లంబాడి తండా వైపు వెళ్తుండగా మూల మలుపు వద్ద బైక్ అదుపుతప్పి కిందపడిడటంతో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. వారిని 108లో బెల్లంపల్లి ఆసుత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో బలరాం కన్నుమూశాడు. మెరుగైన చికిత్స కోసం నవీన్‌ను మంచిర్యాలకు తరలించారు.

బలహీనవర్గాల కోసం పోరాడిన బాబుజగ్జీవన్‌రామ్



జగ్జీవన్‌రామ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్



బెల్లంపల్లి మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్‌పర్సన్



గుడిపేట బెటాలియన్‌లో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న కమాండెంట్

మంచిర్యాల కలెక్టరేట్, ఏప్రిల్ 5: బలహీన, అణగారిన వర్గాల సమానత్వం కోసం పోరాడిన మహనీయుడు బాబు జగ్జీవన్‌రామ్ అని కలెక్టర్ బదావత్ సంతోష్ పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో బాబు జగ్జీవన్‌రామ్ జయంతిని నిర్వహించారు. జిల్లా షెడ్యూల్డు కులముల అభివృద్ధి శాఖ ఉపసంచాలకులు పోటు రవీందర్, కార్పొరేషన్ ఈడీ దుర్గా ప్రసాద్‌తో కలిసి జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి జ్యోతి ప్రజ్వలన చేసి నివాళులర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ సమాజంలో వివక్షపై పాఠశాల స్థాయి నుంచి వ్యతిరేకిస్తూ బలహీన, అణగారిన వర్గాల సమానత్వం కోసం కృషి చేశారన్నారు. దేశ ఉప ప్రధానిగా వ్యవసాయ, ఆహార రక్షణ శాఖలతోపాటు వివిధ శాఖల్లో మంత్రిగా అనేక సంస్కరణల ద్వారా ప్రజా సంక్షేమానికి కృషి చేశారని పేర్కొన్నారు. దుర్గాప్రసాద్, రమేష్, రవీందర్‌రెడ్డి, వెంకటేష్ పాల్గొన్నారు.

ఎస్సీ బాయ్స్ హాస్టల్‌లో దళిత సంఘాలు, అంబేద్కర్ సంక్షేమ సంఘం నాయకులు జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పోచం, బానేష్, దశరథం, బోస్,వెంకటేష్, రాజారావు పాల్గొన్నారు.

ఏసీసీ: మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ రావుల ఉప్పలయ్య జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉప ప్రధానిగా దేశానికి ఎనలేని సేవలందించారని కొనియాడారు. టీఎన్‌జీవో భవనంలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లా అధ్యక్షుడు గడియారం శ్రీహరి పాల్గొన్నారు.

బెల్లంపల్లి: బాబు జగ్జీవన్‌రామ్ జయంతి మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించారు. చైర్‌పర్సన్ జక్కుల శ్వేత ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కౌన్సిలర్లు విజయ, తిరు మల, కృష్ణ, కమిషనర్ మల్లారెడ్డి, ఏఈఈ సందీప్, టీవో ఆశిత్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి కేక్ కట్ చేశారు. ముచ్చర్ల మల్లయ్య, చిలుముల శంకర్, చిన్నరాజం, రొడ్డ శారద, నాతరి స్వామి, పాల్గొన్నారు.

హాజీపూర్: మండల కేంద్రంలో బాబు జగ్జీవన్‌రామ్ జయంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మల్యాల బాపు, శిల్పశ్రీనివాసరావు, కిష్టయ్య లింగయ్య పాల్గొన్నారు.

గుడిపేటలోని 13వ బెటాలియన్‌లో కమాండెంట్ జమీల్‌భాష జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. స్వాతంత్ర్య సమరయోధునిగా, సంఘ సంస్కర్తగా పరిపాలన దక్షతతో విశేష సేవలందించారని కొనియాడారు. శ్రీనివాస్, మారుతి, కుమారస్వామి పాల్గొన్నారు.

నస్పూర్: మున్సిపాలిటీ కార్యాలయంలో బాబు జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మున్సిపల్ కమిషనర్ చిట్యాల సతీష్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చెన్నూరు: చెన్నూరు మండల పరిషత్ కార్యాలయంలో జగ్జీవన్‌రామ్ జయంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సయ్యద్ ఆలీ, సిబ్బంది పాల్గొన్నారు.

జైపూర్: మాజీ ఉప ప్రధాన మంత్రి బాబు జగ్జీవన్‌రామ్ జయంతి ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించారు. ఎంపీడీవో సత్యనారాయణ జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

తాండూర్: బాబుజగ్జీవన్‌రామ్ జయంతిని తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయబ్ తహసీల్దార్ ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

కాసిపేట: బాబుజగ్జీవన్‌రామ్ జయంతి దళిత బహుజన సంఘాల నాయకులు నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జాడి పోశం, మల్లయ్య, బాపు, పాల్గొన్నారు.



టీఎన్‌జీవో కార్యాలయంలో జగ్జీవన్‌రామ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

దండెపల్లి: ప్రభుత్వ కార్యాలయాలు, గ్రామ పంచాయతీల్లో బాబు జగ్జీవన్‌రామ్ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు రమేష్, మల్లేష్, శ్రీనివాస్, రవి, సత్యం పాల్గొన్నారు. గుడిరేవు బాబాసాహెబ్ విగ్రహం వద్ద అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో జయంతిని నిర్వహించారు. బాపు, రాజమల్లు, అంజన్న, పాల్గొన్నారు.

వేమనపల్లి: మండల పరిషత్ కార్యాలయంలో బాబుజగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీనియర్ అసిస్టెంట్ లక్ష్మీనారాయణ, సిబ్బంది ప్రణయ్, గంగారాం తదితరులు పాల్గొన్నారు.

భీమిని: తహసీల్దార్ కార్యాలయంలో బాబూజగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తహసీల్దార్ బీకర్ణదాస్ మాట్లాడుతూ జగ్జీవన్‌రామ్ ఆశయ సాధనకు ప్రతీ ఒక్కరూ కృషిచేయాలన్నారు.

కోటపల్లి: మండల పరిషత్ కార్యాలయంలో బాబు జగ్జీవన్‌రామ్ జయంతి నిర్వహించారు. సూపరింటెండెంట్ లక్ష్మయ్య, ఏపీవో బాలయ్య, కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

మందమర్రిటౌన్: బాబు జగ్జీవన్‌రామ్ జయంతి సింగరేణి పాఠశాల మైదానంలో ఆదిజాంబవంతుల వేదిక నాయకులు నిర్వహించారు. బడుగు, బలహీన వర్గాల కోసం చేసిన కృషిని కొనియాడారు. వాసాల శంకర్, రాజనర్సు ఓదెలు, రాజన్న, దుర్గా ప్రసాద్, ప్రవీణ్, పాల్గొన్నారు.

జన్నారం: మండల కేంద్రంలోని అంబేద్కర్ భవన్‌లో అంబేద్కర్ సంఘం నాయకులు జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. భరత్‌కుమార్, ప్రభుదాస్, ఇందయ్య, భాస్కర్‌గౌడ్ పాల్గొన్నారు.

మందమర్రిరూరల్: ఎంపీడీవో కార్యాలయంలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సారయ్య, రఘు, సతీష్, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీరాంపూర్: ఎంఆర్‌పిఎస్, ఎంఎస్‌పి ఆధ్వర్యంలో జగ్జీవన్ రాం భవన్‌లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మంతెన మల్లేష్ మాదిగ, గద్దల బానయ్య, చుంచు శంకర్ వర్మ, నెలవేని మధునయ్య, బోయిని మధు, నాంపల్లి స్వామి పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలి



భీమినిలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న తహసీల్దార్

దండెపల్లి, ఏప్రిల్ 5: ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని చింతపల్లి వీవో అధ్యక్షురాలు అక్కల మల్లక్క అన్నారు. చింతపల్లిలో శుక్రవారం ఐకేపీ కొనుగోలు కేంద్రాన్ని సంఘం సభ్యులతో కలిసి ప్రారంభించారు. రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తీసుకువచ్చి మద్దతు ధర పొందాలన్నారు. సీఏ వెంకటలక్ష్మి, గొర్ల స్వప్న, పింగిళి శ్రీలత, మేడిశెట్టి మల్లేష్, జెట్టి సత్యం, గొడ్డేటీ రాజన్న, పాల్గొన్నారు.

భీమారం: అంకుశాపూర్, పోలంపల్లి, ఆరేపల్లి, సుంకరపల్లి, ఆర్కపల్లి, కాజీపల్లి, దాంపూర్ గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఐకేపీ ఏపీఎం త్రయంబకేశ్వర్ మాట్లాడుతూ రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి మద్దతు ధర పొందాలని సూచించారు.

భీమిని: పంట ఉత్పత్తులకు మద్దతు ధర కల్పించేందుకే కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసిందని తహసీల్దార్ బీకర్ణ దాస్ అన్నారు. మండలంలోని వీగాం గ్రామాల్లో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభించి మాట్లాడారు. దళారులకు విక్రయించి మోసపోవద్దని, కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఏ గ్రేడ్ క్వింటాలుకు రూ. 2203, సాధారణ రకానికి రూ. 2183 మద్దతు ధర ఇస్తుందన్నారు. వెంట టార్పాలిన్ కవర్లు వెంట తెచ్చుకోవాలన్నారు.

జన్నారం: ఇందన్‌పల్లి, మురిమడుగు, కలమడుగు, కిష్టాపూర్, దేవునిగూడ, కవ్వాల, రోటిగూడ, రాంపూర్ గ్రామాల్లోఐకేపీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏపీఎం బుచ్చన్న, స్పెషల్ ఆఫీసర్ రాజ్‌కుమార్‌లు ప్రారంభించారు. మండల సమాఖ్య సభ్యులు స్వప్న, శారద, సంగీత, సీసీలు విజయలక్ష్మీ, సదాచారి, శ్రీనివాస్, దేవమ్మసరోజ, సునీత, పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

బెల్లంపల్లి, ఏప్రిల్ 5: అక్రమంగా తరలిస్తున్న 5.4 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని శుక్రవారం బెల్లంపల్లిలోని పెట్రోలు బంకు సమీపంలో పట్టుకున్నట్లు టూ టౌన్ ఎస్ఐ రమేష్ తెలిపారు. ఎస్ఐ మాట్లాడుతూ బియ్యాన్ని మహారాష్ట్రకు వాహనంలో తరలిస్తుండగా పట్టుకున్నామన్నారు. నిందితులు అక్షయ్‌కుమార్, ఇందూరి శ్రీనివాస్‌లను అదుపులోకి తీసుకుని బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. పోలీసులు పాల్గొన్నారు.

ఫ్లాగ్ మార్చ్

తాండూర్, ఏప్రిల్ 5: రేచినిలో శుక్రవారం ఎస్ఐ జగదీష్‌గౌడ్ ఆధ్వర్యంలో సీఆర్‌పీఎఫ్ బలగాలతో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఎస్ఐ మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా ప్రజలందరు సహకరించాలన్నారు. ప్రలోభాలకు లొంగకుండా నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ఏఎస్ఐ లక్ష్మణ్, కానిస్టేబుల్‌లు పాల్గొన్నారు.

రవీంద్రనగర్‌లో పోలీసుల ఫ్లాగ్ మార్చ్



ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్న సీఆర్పీఎఫ్, టీఎస్ఎస్‌పీ పోలీసులు

చింతలమానేపల్లి, ఏప్రిల్ 5: మండలంలోని రవీంద్రనగర్-2, బాబాపూర్ గ్రామాల్లో కౌటాల సీఐ సాదిక్ పాషా ఆధ్వర్యంలో సీఆర్పీఎఫ్, టీఎస్ఎస్‌పీ పోలీసు సిబ్బందితో కలిసి ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా బస్టాండు వద్ద వాహనాల తనిఖీ నిర్వహించారు. వాహనదారులకు రోడ్డుసేఫ్టీపై అవగాహన కల్పించారు. ప్రశాంత వాతావరణంలో పార్లమెంట్ ఎన్నికలు జరిగేలా చూడాలని, ప్రతిఒక్కరు తమ ఓటుహక్కును స్వేచ్ఛగా వినియోగించు కోవాలని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో ఎస్సై నరేష్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పాపన్నపేటలో పిచ్చికుక్క స్వైరవిహారం

● 8మందికి గాయాలు



అరచేతిలో కుక్క చేసిన గాయం

బెజ్జూరు, ఏప్రిల్ 5: మండలంలోని పాపన్నపేట గ్రామంలో శుక్రవారం పిచ్చి కుక్క దాడిలో ఎనిమిదికి గాయాలు అయ్యాయి. మరికొంత మంది పిచ్చికుక్కదాడి నుంచి తప్పించుకుని పారిపోయారు. దీంతో గ్రామస్థులు దాడిచేసిన పిచ్చి కుక్కను అక్కడికక్కడే చంపేశారు. గ్రామానికి చెందిన మానేపల్లి సత్తయ్య, అగాడి సాంబయ్య, దందెర గంగు, కుదురుపాక సుగుణ, ఎల్లూరి పోశన్న, దందెర నాని, ఒట్టే బొందయ్య, లక్ష్మణ్‌ను పిచ్చి కుక్క దాడిచేసి కరవడంతో వీరందిరిని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించి వైద్యంఅందించారు. వీరంతా గ్రామంలో ఇంటిముందు, ఇళ్లలో పని చేస్తుండగా ఒక్కసారిగా పిచ్చికుక్క పరుగెత్తుకుంటూ వచ్చి గాయపర్చింది.

వేర్వేరు ఘటనల్లో ఇద్దరి ఆత్మహత్య

సిర్పూర్(టి), ఏప్రిల్ 5: సిర్పూర్(టి) మండల చింతకుంట గ్రామానికి చెందిన కోట శైలం(36) మనస్థాపంతో శుక్రవారం ఇంటివెనక చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహ త్యకు పాల్పడ్డాడు. ఎస్సై దీకొండ రమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. కోట శైలంకు అతని భార్యకు గొడవలు జరుగు తున్నాయి. ఈ క్రమంలో మరదలు పెళ్లికి పిలవలేదని మనస్థాపంతో ఇంటి వెనకభాగంలో చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. మృతుడి తండ్రి ఇచ్చిన ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అలాగే మండలకేంద్రంలోని గోవింద్‌పూర్‌కు చెందిన కె రవి(22) మద్యానికి బానిసై రెండు నెలలుగా హిజ్రాల్లో కలుస్తానని ఇంటినుంచి వెళ్లి పోయాడు. శుక్రవారం తిరిగి ఇంటికి వచ్చి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయం గమనించిన కుటుంబసభ్యులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి అక్కడినుంచి కాగజ్‌నగర్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందినట్లు తెలిపారు. మృతుడి తండ్రి గున్నాజీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.


మాట్కా ఆడిన ఇద్దరిపై కేసు

కాగజ్‌నగర్, ఏప్రిల్ 5: స్థానిక నెహ్రూ కాలనీలో మట్కా ఆడుతున్న ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌వో శంకరయ్య తెలిపారు. ముందస్తుగా అందిన సమాచారం మేరకు దాడులు నిర్వహించినట్లు తెలిపారు. మట్కా ఆడుతున్న ఆజ్గర్, ఆఫ్జల్ నుంచి నగదు స్వాధీనపర్చుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

హాల్ టిక్కెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలి

ఆసిఫాబాద్ రూరల్, ఏప్రిల్ 5: జిల్లాకేంద్రంలోని ఆదర్శ పాఠశాల(మోడల్ స్కూల్)లో 6నుంచి 10వ తరగతులలో ప్రవేశం కోసం ఈనెల 7న నిర్వహించే ప్రవేశపరీక్ష కోసం హాల్ టిక్కెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని ప్రిన్సిపాల్ అబ్దుల్ ఖలీల్ సూచించారు.

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
మంచిర్యాల
జిల్లా వార్తలు
3
శనివారం 6 ఏప్రిల్ 2024



భూగర్భ జలాలను కాపాడాలి

జన్నారం, ఏప్రిల్ 5: చెరువులను తవ్వుతూ మొరం అక్రమంగా తరలిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని సామాజిక కార్యకర్త భూమాచారి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అక్రమంగా మొరం తరలించే వీడియోలు, ఫొటోలను అధికారులకు చూపించినా పట్టించుకోవడం లేదని, ఇప్పటికైనా అధికారులు అక్రమంగా మొరం, ఇసుక రవాణా కాకుండా చూడాలన్నారు.



రంజాన్ వేళలు
ఇఫ్తార్ | 6:32
శనివారం
సహర్ | 4:42
ఆదివారం

మంచిర్యాల వద్ద నీరులేక బోసిపోయిన గోదావరి



కళ తప్పిన గోదావరి

- నీరు లేక ఎడారిని తలపిస్తున్న పుణ్యవాహిని
- కాళేశ్వరం ప్రాజెక్టులు కుంగడంతోనే ఈ దుస్థితి
- అడుగంటుతున్న భూగర్భ జలాలు

మంచిర్యాల, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): గలగలా పారుతూ సవ్వడి చేసే గోదావరి ప్రస్తుతం కళ తప్పింది. నీరు లేక వెలవెలబోతూ బోసిగా కనిపిస్తోంది. పుణ్య స్నానాలకు సైతం నీరందించని దీన స్థితిలో ఉంది. పర్వదినాలు, శుభ, అశుభ కార్యక్రమాలకు నది తీర ప్రాంతాలకు చెందిన వారే కాకుండా సుదూర ప్రాంతాల నుంచి ప్రజలు తరలివచ్చి జిల్లాలోని పలు చోట్ల గోదావరి స్నానం ఆచరించేవారు. జిల్లాలోని గూడెం, మంచిర్యాల, చెన్నూర్ ప్రాంతాల్లో పవిత్ర దినాల్లో పుణ్యస్నానాల కోసం భక్తులు గోదావరి తీరం వెంట బారులు తీరేవారు.

రివర్స్ పంపింగ్‌తో జలకళ...


బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 2018లో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టుల సముదాయం కారణంగా ఐదేళ్లుగా నదిలో పుష్కలంగా నీరు అందుబాటులో ఉండేది. రివర్స్ పంపింగ్ ద్వారా 2019 జూలైలో తొలి సారిగా దిగువ నుంచి ఎగువకు నీరు ప్రవహించి, గోదావరి జలకళను సంతరించుకుంది. కాళేశ్వరం నుంచి రివర్స్ పంపింగ్ ద్వారా గోదావరి నదిలోకి నీటిని ఎత్తిపోయడంతో అన్నారం, మేడిగడ్డ, అక్కడి నుంచి గోలివాడ సమీపంలోని సుం దిళ్ల బ్యారేజీలోకి నీటిని ఎత్తిపోసేవారు. సుందిళ్ల పంప్‌హౌజ్ నుంచి వెట్‌రన్ నిర్వహించడం ద్వారా ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి ఎత్తిపోసేవారు. దీంతో మంచిర్యాల వద్ద గోదావరి నదిలో నీరు ఎల్లప్పుడు పుష్కలంగా ఉండేది.

అడుగంటుతున్న భూగర్భ జలాలు

గోదావరి నది ఎండిపోవడంతో భూగర్భ జలాలు అడుగంటి పోతున్నాయి. ఇంత కాలం నదిలో నిండుగా నీరుండటంతో గోదావరి పరి వాహక భూగర్భ జలాలు పుష్కలంగా ఉండేవి. దీంతో ఆయా ప్రాంతాల్లోని బోర్లు, ఇతర నీటి వనరుల్లో నీరు అందుబాటులో ఉండేది. ప్రస్తుతం గోదావరి పూర్తి గా ఎండిపోవడంతో భూగర్భ జలాలు అడుగంటు తుండగా బోర్లలోనూ నీరు అడుగంటుతోంది. కాళేశ్వరం ప్రాజెక్టుల సముదాయం నిర్మాణంతో పరిస్థితులు ఆశాజనకంగా మారగా, ఆ ఆనందం ప్రజల్లో ఎంతోకాలం నిలువలేదు. మంచిర్యాల పట్టణంతోపాటు నది పరివాహక ప్రాంతాల ప్రజలు నీటి ఎద్దడిని ఎదుర్కోక తప్పని పరిస్థితులు అగుపిస్తున్నాయి. మరోవైపు ఎల్లంపల్లి ప్రాజెక్టులోనూ నీటి నిల్వలు అంతంత మాత్రమే ఉండటంతో తాగునీటి ఇక్కట్లు ప్రారంభమయ్యాయి. గ్రామాలు, పట్టణా ల్లో తాగునీటిని రోజు విడిచిరోజు సరఫరా చేస్తున్నారు.

ప్రాజెక్టులు కుంగడంతో ఎడారిలా...

కాళేశ్వరం ప్రాజెక్టుల సముదాయం కుంగడంతో పరిస్థితి ఛిన్నాభిన్నం అయింది. 2019 జూలై నుంచి 2023 జూలై వరకు నిత్యం నీటితో కళకళ లాడిన గోదావరి ప్రస్తుతం నీరులేక ఎడారిని తలపిస్తోంది. జూలైలో గోదావరికి సంభవించిన భారీ వరదల కారణంగా కాళేశ్వరం ప్రాజెక్టుల సముదాయంలో అన్నారం, మేడిగడ్డ ప్రాజెక్టులు కుంగిపోయిన విషయం తెలిసిందే. దీంతో ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆయా ప్రాజెక్టుల్లో అప్పటిదాకా నిలువ చేసిన నీటినంతటినీ అధికారులు గేట్లు తెరిచి, దిగువకు వదిలివేశారు. నీరు మొత్తం వెళ్లిపో యాక గోదావరికి కళ తప్పింది. కాళేశ్వరం సముదాయం నిర్మాణం జరిగిన ఐదేళ్ల తరువాత ఈ పరిస్థితి దాపురించింది.



రివర్స్ పంపింగ్‌తో నిండా నీటితో కళకళలాడుతున్న గోదావరి (ఫైల్)

ఎకరానికి రూ. 25 వేలు చెల్లించాలి



మాట్లాడుతున్న గోమాస శ్రీనివాస్

ఏసీసీ, ఏప్రిల్ 5: సాగునీరందక ఎండిన పంటలకు రాష్ట్ర ప్రభుత్వం ఎకరానికి రూ.25 వేలు ఇవ్వాలని పెద్దపల్లి పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి గోమాస శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్‌లు అన్నారు. శుక్రవారం ఐబీ చౌరస్తాలో చేపట్టిన రైతు సత్యాగ్రహ దీక్షలో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల సమయంలో రూ.2 లక్షల పంట రుణమాఫీ, రూ.15 వేల రైతు భరోసా, నీరందక ఎండిన పంటలకు ఎకరానికి రూ.25 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. హామీలు ఇచ్చి రైతులను మోసం చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ధాన్యం కొనుగోలులో తేమ, తప్ప, తాలు పేరుతో తరుగుతీసి రైతులను దోచుకుంటే రేవంత్‌రెడ్డి ప్రభుత్వం సాగు నీరందక ఎండిన పంటలకు పరిహారం చెల్లించకుండా మోసం చేస్తోందన్నారు. పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గంలో కుటుంబ పాలన సాగిస్తున్న వివేక్ కుటుంబాన్ని తరిమికొట్టాలన్నారు. గతంలో బీజేపీలో ఉన్నప్పుడు కాళేశ్వరం ప్రాజెక్టు బ్యాక్ వాటర్ వల్ల పంటలు మునిగిపోయిన రైతులకు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేసి ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత ఒక్కసారి కూడా అసెంబ్లీలో మాట్లాడలేదన్నారు. వివేక్‌కు కొడుకును ఎంపీ చేయాలనే తప్ప వేరే ఆలోచన లేదన్నారు. రైతుల సంక్షేమానికి కేంద్రంలోని మోదీ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందన్నారు. రామగుండం ఎరువుల కర్మాగారాన్ని ప్రధాని పునరుద్ధరించారన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో కమలం పువ్వు గుర్తుకు ఓట్లు వేయాలని కోరారు. నాయకులు జైన్, దుర్గం అశోక్, మల్లారెడ్డి, కొయ్యల ఏమాజీ, వెంకటేశ్వర్‌గౌడ్, సిసోడియా పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు

తాండూర్, ఏప్రిల్ 5: తాండూర్ మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని శుక్రవారం మండల ప్రత్యేకాధికారి గజానంద్, ఎంపీడీవో శ్రీనివాస్‌లు ప్రారంభించారు. వారు మాట్లాడుతూ వేసవిని దృష్టిలో ఉంచుకుని చలివేంద్రం ఏర్పాటు చేశామన్నారు. ప్రతి గ్రామంలో చలివేంద్రాలను ప్రజలకు అందుబాటులో ఉంచాలని కార్యదర్శులకు సూచించారు. సూపరింటెండెంట్ వేణుగోపాలరావు, కార్యదర్శులు పాల్గొన్నారు.

అవార్డు అందుకున్న విద్యార్థులు



చెన్నూరు, ఏప్రిల్ 5: సర్ సీవీ రామన్ యంగ్ జీనియస్ అవార్డు, సూచిర్ ఇండియా ఫౌండేషన్ వారు నిర్వహించిన ప్రతిభ పరీక్షలో చెన్నూరులోని లయోల పాఠశాల విద్యార్థిని మోక్ష, శ్రీలక్ష్మిత, రైజింగ్ సన్ పాఠశాల విద్యార్థి ప్రణీత్‌లు ప్రతిభ కనబర్చారు. గురువారం రాత్రి హైద్రాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో సినీ గేయ రచయిత చంద్రబోస్ చేతుల మీదుగా విద్యార్థులు అవార్డులు అందుకున్నారు. సూచిర్ ఇండియా సంస్థ అధ్యక్షుడు కిరణ్, జిల్లా కో ఆర్డినేటర్ ప్రవీణ్ పాల్గొన్నారు.

పోలీసుల ఆధ్వర్యంలో శ్రమదానం



కాసిపేట, ఏప్రిల్ 5: మండలంలోని రొట్టెపల్లి, వెంకటాపూర్ గ్రామాల్లో దేవాపూర్ పోలీసులు శుక్రవారం శ్రమదానం చేపట్టారు. ప్రధాన రహదారులకు ఇరువైపులా ఉన్న పిచ్చి మొక్కలను తొలగించారు. దేవాపూర్ ఎస్ఐ ఆంజనేయులు మాట్లాడుతూ రహదారికి ఇరువైపులా పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగి వాహనదారులకు రోడ్డు కనబడక ప్రమాదాలు జరుగుతున్నాయని గ్రహించి చెట్లను తొలగించామన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు అందరు కృషి చేయాలన్నారు. పోలీసులు, యువకులు పాల్గొన్నారు.

కొత్త మండలాల్లో సమస్యల తిష్ట

- అద్దె భవనాల్లో కార్యాలయాలు
- ఒక్కో కార్యాలయం ఒక్కో చోట
- పీహెచ్‌సీలు, కళాశాలలు లేక ఇబ్బందులు

ప్రభుత్వ పాలనను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలనే ఉద్దేశ్యంతో జిల్లాలో భీమారం, హాజీపూర్, కన్నెపల్లి మండలాలను ఏర్పాటుచేశారు. కార్యాలయాలు అద్దె భవనాల్లో కొనసాగుతుండగా ఇన్‌చార్జి అధికారులు విధులు నిర్వహిస్తున్నారు. గ్రంథాలయం, పీహెచ్‌సీ, జూనియర్ కళాశాలలు లేవు. కార్యాలయాలు ఒక్కో చోట ఉండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కొత్త మండలాల సమస్యలపై 'ఆంధ్రజ్యోతి' ఫోకస్...



భీమారం: గ్రామపంచాయతీ భవనంలో కొనసాగుతున్న మండల పరిషత్ కార్యాలయం

భీమారం, ఏప్రిల్ 5: కొత్తగా ఏర్పడిన భీమారం మండల ప్రజలు సమస్యలతో సతమతమవుతున్నారు. జైపూర్ ఉమ్మడి మండలం నుంచి 2016 అక్టోబర్ 18న భీమారంను మండలంగా గత ప్రభుత్వం ఏర్పాటు చేసింది. మండలంగా ఏర్పాటై ఏడు సంవత్సరాలు పూర్తవుతున్నా ఎక్కడి సమస్యలు అక్కడే దర్శనమిస్తున్నాయి.

అద్దె భవనాల్లో కార్యాలయాలు

తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు సొంత భవనాలు లేక అధికారులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామపంచాయతీ భవనంలో మండల పరిషత్ కార్యాలయాన్ని నిర్వహిస్తున్నారు. గతంలో అటవీశాఖ భవనంలో పోలీస్‌స్టేషన్‌కు కేటాయించగా ఇదే భవనంలో తహసీల్దార్ కార్యాలయం కొనసాగుతోంది. ఒక్కో కార్యాలయం ఒక్కో చోట ఉండడంతో ప్రజలు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు. బస్టాండ్ నుంచి తహసీల్దార్, అగ్రికల్చర్ కార్యాలయానికి వెళ్లాలంటే ఆటోకు రూ.300 అవుతున్నాయని ప్రజలు వాపోతున్నారు. జైపూర్ మండలంగా ఉన్నప్పుడు బస్సు దిగగానే కార్యాలయాలు ఉండేవని పేర్కొంటున్నారు.

జైపూర్ వ్యవసాయ అధికారి ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. గ్రంథాలయం లేకపోవడంతో నిరుద్యోగులు, పాఠకులు ఇబ్బందులు పడుతున్నారు. ఊర చెరువును మినీ ట్యాంక్‌బండ్‌గా ఏర్పాటు చేస్తామని చెప్పినప్పటికీ కార్యరూపం దాల్చలేదు. జూనియర్ కళాశాల లేకపోవడంతో పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులు దూర ప్రాంతాలకు వెళ్లి చదువుకునే స్థోమత లేక మధ్యలోనే ఆపివేస్తున్నారు. బస్టాండ్ లేకపోవడంతో ప్రజలు రోడ్లపైనే నిల్చుంటున్నారు. పబ్లిక్ టాయిలెట్‌లు లేక ప్రజలు, మహిళలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

- పీహెచ్‌సీ లేక ఇబ్బందులు

మండలంలో పీహెచ్‌సీ లేకపోవడంతో ప్రజలు, గర్భిణులు ఇబ్బందులు పడుతున్నారు. జైపూర్ ఆరోగ్య కేంద్రంపై ఆధారపడాల్సి వస్తోంది. జైపూర్ వెళ్లాలంటే దూరభారంతోపాటు సమయం వృథా అవుతుందని ప్రజలు పేర్కొంటున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వమైన అభివృద్ధి చేయాలని, సమస్యలను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.



హాజీపూర్ : రాపెల్లి ఆర్‌అండ్‌ఆర్ కాలనీ కమ్యూనిటీ హాల్‌లో ఎంపీడీవో కార్యాలయం

హాజీపూర్ మండలం...

హాజీపూర్: ఉమ్మడి మంచిర్యాల నుంచి 17 గ్రామాలతో 2016, అక్టోబర్ 10న హాజీపూర్‌ను మండలంగా ఏర్పాటు చేసింది. మండలం ఏర్పడి 8 సంవత్సరాలు పూర్తి కావస్తున్నా సమస్యలు ఎక్కడివక్కడే ఉన్నాయి.

బస్టాండ్ లేక ఇబ్బందులు

బస్టాండ్ లేకపోవడంతో బస్సుల కోసం రోడ్డు పక్కన వేచి చూడాల్సి వస్తుంది. పబ్లిక్ టాయిలెట్లు లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. తహసీల్దార్, వ్యవసాయ కార్యాలయాలు రాపెల్లిలోని ఆర్‌అండ్‌ఆర్ కాలనీ ప్రభుత్వ పాఠశాలలో, ఎంపీడీవో కార్యాలయం కమ్యూనిటీ హాలులో కొనసాగుతోంది. సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల ముల్కల్లలోని ప్రైవేటు అద్దె భవనంలో నడుస్తోంది. ముల్క ల్లలోని పశువైద్యశాల శిథిలావస్థలో ఉన్న భవనంలో కొనసాగుతుండడంతో రైతులు, సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. గ్రంథాలయం లేకపోవడంతో పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న నిరుద్యోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మంచిర్యాలలోని గ్రంథాలయానికి వెళ్తుండడంతో ఆర్థికంగా భారం పడుతోంది. జూనియర్ కళాశాల లేకపోవడంతో పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులు మంచిర్యాలకు వెళ్లి విద్యనభ్యసిస్తున్నారు.



కన్నెపల్లి : పాఠశాలలో నిర్వహిస్తున్న తహసీల్దార్ కార్యాలయం

పర్యాటక కేంద్రానికి నోచుకోని ఎల్లంపల్లి

ఎల్లంపల్లి ప్రాజెక్టును పర్యాటక కేంద్రంగా చేస్తామని గత ప్రభుత్వం చెప్పినా ఇంతవరకు అమలుకు నోచుకోలేదు. నాగారం, ర్యాలీ, గడ్‌పూర్, చిన్న గోపాలపూర్ గ్రామాలు మండల కేంద్రానికి 32 కిలోమీటర్ల దూరంలో ఉన్నాయి. ఈ గ్రామాల ప్రజలు మండల కేంద్రానికి రావాలంటే మంచిర్యాల మీదుగా హాజీపూర్ రావాల్సి వస్తుంది. దీంతో ఖర్చుతోపాటు సమయం వృథా అవుతుంది. మండల కేంద్రం నుంచి అటవీ ప్రాంతం గుండా వెళితే కేవలం 10 కిలోమీటర్ల దూరంలోనే ఈ గ్రామాలు ఉన్నాయి. ఆ మార్గంలో రోడ్డు వేయాలని ప్రజలు కోరుతున్నా అటవీ శాఖ అనుమతులు లభించడం లేదని పాలకులు నిర్లక్ష్యం చేస్తున్నారు.

కన్నెపల్లి మండలం...

కన్నెపల్లి: భీమిని మండలంలోని కన్నెపల్లిని 2016 అక్టోబర్ 16న నూతన మండలంగా అప్పటి ప్రభుత్వం ఏర్పాటు చేసింది. 15 గ్రామపంచాయతీలను కలిపి కన్నెపల్లి మండలంగా ఏర్పాటు చేసింది. మండల కేంద్రంగా ఏర్పడక ముందు 20 కిలోమీటర్ల దూరంలో ఉన్న భీమిని మండల కేంద్రానికి వెళ్ళేవారు. నూతన మండలంగా ఏర్పడి ఆరు సంవత్సరాలు అవుతున్నా ఇప్పటికీ సమస్యలు పరిష్కారం కావడం లేదు.

మండలంలో ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు లేవు. తహసీల్దార్ కార్యాలయాన్ని ప్రభుత్వ పాఠశాలలో నిర్వహిస్తున్నారు. దీంతో కార్యాలయానికి వచ్చే ప్రజలు, అధికారులు ఇబ్బందులు పడుతున్నారు. ఎంపీడీవో కార్యాలయాన్ని అద్దె భవనంలో నిర్వహిస్తున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లేకపోవడంతో ప్రజలు భీమిని వెళ్తున్నారు. అత్యవసరం అయితే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వ్యవసాయ కార్యాలయాన్ని రైతువేదికలో నిర్వహిస్తున్నారు. మండల కేంద్రంలో పశువైద్యశాల లేకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మండలంలోని సమస్యలను పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.

కొత్త చిగురు పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కవులు

ఏసీసీ, ఏప్రిల్ 5: జిల్లా సాహితీ సంరక్షణ సమితి ఆధ్వర్యంలో రచయిత్రి వైద్య సుజాత రచించిన కొత్త చిగురు పుస్తకాన్ని శుక్రవారం శిశుమందిర్ పాఠశాలలో ఆవిష్కరించారు. సభాధ్యక్షుడిగా ఎంవీ పట్వర్ధన్ వ్యవహరించారు. ఈ సందర్భంగా కవులు మాట్లాడుతూ పుస్తక రచయిత తన ఆలోచనలు, అనుభవాలను 72 కవితల ద్వారా ఆకట్టుకునే విధంగా పుస్తకాన్ని మలిచారన్నారు. కవులు నాగభూషణం, వినోద్, నీలాదేవి, రాజేశం, శ్రీనాథ్‌గౌడ్, దండనాయకుల వామన్‌రావు, అల్లాడి శ్రీనివాస్, పెద్ది భరత్, నందమయ్య పాల్గొన్నారు.

పక్షుల సంరక్షణపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న వెంకటేష్

భీమారం, ఏప్రిల్ 5: భీమారంలోని కస్తూర్బా, ఆశ్రమ పాఠశాలల్లోని విద్యార్థులకు శుక్రవారం సామాజిక కార్యకర్త, పక్షి ప్రేమికుడు జక్కుల వెంకటేష్ ప్రకృతితో స్నేహం-పక్షులకు సహాయం అనే కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ మన జీవన విధానం ప్రకృతితో ముడిపడి ఉందన్నారు. నీటి వనరులను కాపాడాలన్నారు. పక్షులు నీరు తాగేందుకు ఇండ్ల పరిసరాల్లో డాబాలపై నీటిని ఏర్పాటు చేయాలన్నారు. ప్రతీ ఒక్కరు పక్షుల సంరక్షణకు కృషి చేయాలన్నారు. అనంతరం పాఠశాలల ఆవరణలో నీటి తొట్టిలు, బర్డ్‌ఫీడర్లు ఏర్పాటుచేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జిల్లాకు చేరిన రాజ్యాంగ రక్షణ యాత్ర

ఏసీసీ, ఏప్రిల్ 5 : రాజ్యాంగం జోలికి వస్తే పీఠాలు కదిలి పదవులు ఊడుతాయని రాజ్యాంగ రక్షణ యాత్ర రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ అన్నారు. శుక్రవారం రాజ్యాంగ రక్షణ యాత్ర మంచిర్యాలకు చేరుకోగా నాయకులు స్వాగతం పలికారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సుధాకర్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ అన్ని కులాలు, మతాల వారికి రాజ్యాంగాన్ని కాపాడే బాధ్యత ఉందన్నారు. బీజేపీ లోక్‌సభలో 400 సీట్లు వస్తే రాజ్యాంగాన్ని మారుస్తామని ప్రగల్భాలు పలుకుతుందన్నారు. కులాలు, మతాల ఆధారంగా విభజించి పాలించాలని చూస్తున్న నాయకుల పదవులు ఊడుతాయని హెచ్చరించారు. జైభీందళ్ కోకన్వీనర్ పురుషోత్తం, జిల్లా అధ్యక్షుడు గజెల్లి లక్ష్మణ్, రామస్వామి పాల్గొన్నారు.



యాత్రకు స్వాగతం పలుకుతున్న నాయకులు

మహిళ మృతి కేసులో అంబులెన్స్ డ్రైవర్ అరెస్టు



మాట్లాడుతున్న ఏసీపీ ప్రకాష్

ఏసీసీ, ఏప్రిల్ 5: లక్షెట్టిపేటకు చెందిన మ్యాదరి సింధూజ మృతి కేసులో జిల్లా కేంద్రంలో అంబులెన్స్ నడుపుతున్న తోకల సాగర్‌ను అరెస్టు చేసినట్లు ఏసీపీ ప్రకాష్ తెలిపారు. శుక్రవారం ఏసీపీ కేసు వివరాలను వెల్లడించారు. జైపూర్ మండలం నర్సింగాపూర్ చెందిన తోకల సాగర్ అంబులెన్స్ నిర్వహిస్తున్నాడు. రోగులను కమీషన్‌లు ఇచ్చే ఆసుపత్రికి తరలించి డబ్బులు సంపాదించాలని కరీంనగర్‌లోని అకిరా ఆసుపత్రి యాజమాన్యంతో ఒప్పందం చేసుకున్నాడన్నారు. మార్చి 29న లక్షెట్టిపేటలో ప్రమాదానికి గురైై మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో అడ్మిట్ అయిన సింధూజను కరీంనగర్‌కు తీసుకువెళ్లాలని వైద్యులు సూచించారు. రోగి బంధువులు సాగర్‌కు చెందిన అంబులెన్స్‌ను మాట్లాడుకొని కరీంనగర్‌లోని కెల్విన్ ఆసుపత్రికి తీసుకువెళ్లాలని చెప్పారు. ముందుగా మంచిర్యాలలోని వసుధ ఆసుపత్రికి తీసుకువెళ్లాడని, అరగంట సమయం గడిచాక కరీంనగర్‌లోని అకీరా ఆసుపత్రికి తీసుకువెళ్లాడు. అక్కడ వైద్యులు లేకపోవడంతో రోగి బంధువులు చెప్పిన కెల్విన్ ఆసుపత్రికి తీసుకువెళ్లగా అప్పటికే పేషెంట్ బ్రెయిన్‌డెడ్ అయ్యిందని, అరగం ట ముందు తీసుకువస్తే ఈ పరిస్థితి వచ్చేది కాదని డాక్టర్లు తెలిపాడన్నారు. బ్రెయిన్‌డెడ్ అయిన సింధూజను తిరిగి మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువచ్చి చేర్పించగా చికిత్స పొందుతూ ఈనెల 1న మృతి చెందిందని తెలిపారు. రోగి బంధువుల ఫిర్యాదు మేరకు అంబులెన్స్ డ్రైవర్‌ను కోర్టులో హాజరు పర్చి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు తెలిపారు. నిందితుని నుంచి అంబులెన్స్, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నట్లు ఏసీపీ తెలిపారు. సీఐ బన్సీలాల్, ఎస్ఐ పాల్గొన్నారు.

అంబేద్కర్ సంఘం కార్యవర్గం

దండెపల్లి, ఏప్రిల్ 5: గుడిరేవు అంబేద్కర్ యువజన సంఘం కమిటీని శుక్రవారం ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా సంతపూరి ఆశన్న, అధ్యక్షుడిగా ఫిరంగి జైలు, ప్రధాన కార్యదర్శిగా అరికెల్ల పోచయ్య, కోశాధికారిగా కామెర రమేష్, ఉపాధ్యక్షులుగా సంతపూరి కిరణ్, అరికెల లింగన్న, జాడి గంగమల్లు, ప్రచార కార్యదర్శులుగా శేఖర్, జాడి విజయ్‌కుమార్, ప్రధాన సలహాదారులుగా బేర గంగరాజు, జంగిలి రాజశేఖర్, నర్సయ్య, జాడి తిరుపతి, మహేందర్, రాజ్‌కుమార్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. లింగంపల్లి బాపు, రాజమల్లు, మేడ దయాకర్ పాల్గొన్నారు.

జిల్లావాసికి అవార్డు

మంచిర్యాల కలెక్టరేట్, ఏప్రిల్ 5 : మయూరి ఆసుపత్రి వైద్యుడు అశోక్ శుక్రవారం హైద్రాబాద్‌లో నంది పురస్కారాన్ని శిఖరఆర్ట్స్ సంస్థ వారు అందజేశారు.మయూరి ట్రస్టు ద్వారా సేవా కార్యక్రమాలకు కేటాయించారు.

పాఠశాలలకు అనుమతులు ఇవ్వవద్దు

మంచిర్యాల కలెక్టరేట్, ఏప్రిల్ 5: జిల్లా వ్యాప్తంగా కొత్త బ్రాంచీల పేరుతో పాఠశాలలు ఏర్పాటు చేస్తున్నాయని, ఇలాంటి పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీకాంత్ డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎలాంటి అనుమతులు గుర్తింపు లేకుండా ఎథిక్స్, శ్రీచైతన్య, మిమ్స్ గ్రీన్‌వుడ్, డాన్, కేరళ, సాధన, పల్లవి పాఠశాలల యాజమాన్యాలు కరపత్రాలు, బ్యానర్లతో ప్రచారం చేస్తూ తల్లిదండ్రులను మోసం చేస్తున్నాయన్నారు. వెంటనే డీఈవో, ఎంఈవోలు స్పందించి పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనుమతులు లేని పాఠశాలలను రద్దు చేయాలని కొంత కాలంగా విద్యాశాఖ అధికారులను కోరుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. వెంటనే విద్యాశాఖ అధికారులు స్పందించకపోతే నిరసన కార్యక్రమాలు చేపడతామన్నారు. సమావేశంలో నాయకులు రాహుల్, ప్రశాంత్ పాల్గొన్నారు.